ఓం శ్రీ సాయిరాం

# "సాయి కృష్ణ లీలా తరంగిణి"

(సంగీత నృత్య నాటకం)

## పాత్రలు:

1. కరణం సుబ్బమ్మ
2. సత్య (స్వామి)
3. యశోద
4. కృష్ణుడు
5. బలరాముడు
6. నందుడు
7. గర్గ మహర్షి
8. గోపాలదేవుడు
9. వసంతకుడు
10. ఇంద్రుడు
11. నీలిమ
12. మంజరి

## నృత్యాలు:

1. కృష్ణ – గోపికలు – వేణు సంగీతం
2. నీల మేఘ శరీర
3. జయ జయ గోకుల బాలా
4. గోవింద మిహ గోపికానంద కందం
5. గోపాలకృష్ణయ్య రావయ్యా
6. శరణం భవకరుణామయ
7. గోవర్ధన గిరిధర
8. గోపాలకృష్ణాలాలీ

## శ్లోకాలు – పద్యాలు

1. కస్తూరీ తిలకం
2. ఎదుటనున్న స్వామి
3. కలయో వైష్ణవ మాయయో
4. ఏనుదైవంబు
5. శ్రీ పుట్టపర్తి నిలయుడు

ఓం శ్రీ సాయిరాం

# "సాయి కృష్ణ లీలా తరంగిణి"

(సంగీత నృత్య నాటకం)

రచన : ఎం.ఎస్. ప్రకాశరావు

(కరణం సుబ్బమ్మ ప్రార్థిస్తూ ఉంటుంది)

సుబ్బమ్మ శ్లో : కస్తూరీ తిలకం లలాట ఫలకే వక్షస్థలే కౌస్తుభ:
నాసాగ్రే నవమౌక్తికం కరతలేవేణుం కరేకంకణం
సర్వాంగే హరిచందనంచ కలయం కంఠేచ ముక్తావళీ
గోపస్త్రీ పరివేష్ఠితో విజయతే గోపాల చూడామణీ

సత్య : అమ్మా!

సుబ్బమ్మ : సత్యా! ఉదయం నుంచి ఎక్కడికెళ్ళావయ్యా, నీకోసం ఎంత వెదికానో తెలుసా.

సత్య : ఇప్పుడే కదమ్మా పిలిచావు నన్ను.

సుబ్బమ్మ : ఇప్పుడా. సత్యా సత్యా అని ఉదయం నుంచి తిరుగుతూ ఉంటే

సత్య : అమ్మా నేనెవరిననుకున్నావు

సుబ్బమ్మ : నా బాలకృష్ణుడివయ్యా

సత్య : మరి కృష్ణా అని ఇప్పుడే కదా పిలిచావు

పద్యం : ఎదుటనున్న స్వామినెరుంగలేకను
దేముడుండునంచు తిరుగుచుంద్రు
వెన్న విడిచి నేయి వెదుకలాడినయట్లు
ఉన్న మాట తెలుపుచున్నమాట.

సుబ్బమ్మ : అవునయ్యా బాలగోపాలుడివి నువ్వు నా ఎదురుగా ఉంటే నిన్ను చూసి ఆనందంచక ఎక్కడున్నావో అని వెతుకుతున్నాను. ఆ అజ్ఞానం నాకెప్పుడు పోతుందో.

సత్య : నన్ను బాలకృష్ణుడని భావించగానే నీ అజ్ఞానం పోయిందమ్మా.

సుబ్బమ్మ : సత్యా! ఉదయంనుంచి నాకు దొరక్కుండా ఇలా ఇబ్బంది పెట్టొచ్చా. బాలకృష్ణుడిగా యశోదను కూడా ఇలాగే తిప్పలు పెట్టేవాడివా.

సత్య : యశోదవు నువ్వే కదమ్మా

సుబ్బమ్మ : యశోదను నేనా

సత్య : అవును సుబ్బమ్మా, ఒక్కసారి నా కృష్ణావతరం గుర్తు తెచ్చుకో.

(సుబ్బమ్మ, సత్య నిష్క్రమిస్తారు. శ్రీకృష్ణుడు గోపికాబృందంతో నృత్యం చేస్తూ ప్రవేశిస్తాడు)

యశోద : (ప్రవేశిస్తూ) కృష్ణా! కృష్ణా!

బలరాముడు : అమ్మా చూడమ్మా తమ్ముడు మన్ను తింటున్నాడు.

యశోద : కృష్ణా! మన్ను తింటున్నావా?

కృష్ణుడు : వెన్ననుకున్నానమ్మా

యశోద : మన్నుని వెన్నెలా అనుకున్నావయ్యా?

కృష్ణుడు : దేముణ్ణి నన్ను నువ్వు మానవుడనుకోవడం లేదా అమ్మా. అలాగే.

యశోద : నువ్వు దేవుడివా? దేవుడంటే శంఖ, చక్ర, గదా, పద్మాలు ధరించి ఉంటాడు. బ్రహ్మాండాన్ని తన బొజ్జలో పెట్టుకుంటాడు. తెలుసా! దేవుడంటే నీలాంటి అల్లరి గోపాలుడు కాదు.

కృష్ణుడు : అలాగా అమ్మా! నాకు తెలీదులే.

యశోద : ఏదీ నోరు తెరువు.

(కృష్ణుడు నోరు తెరిచి యశోదకు బ్రహ్మాండమంతా చూపిస్తాడు)

యశోద : పద్యం: కలయో వైష్ణవ మాయయో ఇతర సంకల్పార్థమో సత్యమో
తలపన్నేరక యున్నదాననో, యశోదాదేవి గానో పర
స్థలమో బాలకుడెంత ఈతని ముఖస్తంబై యజాండంబుప్ర
జ్వలమై యుండుట కేమి హేతువో మహాశ్చర్యంబు చింతింపగన్

కృష్ణుడు : అమ్మా అలా చిత్తరువులా ఉండిపోయావేం?

యశోద : కన్నా! మెరిసిపోతున్న దివ్యమంగళ స్వరూపంలా ఉన్నావే నువ్వు, నా కన్నయ్యవేనా

కృష్ణుడు : నీ కన్నయ్యనేనమ్మా. అమ్మా! నువ్వెంత మంచిదానివమ్మా నీ కొడుకెక్కడైనా మన్ను తింటాడా

యశోద : అవున్నాన్నా బుద్ధిమంతుడివి నా బంగారు తండ్రివి నువ్వు మన్ను తింటావా.

పల్లవి : బాల గోపాలకృష్ణ పాహిపాహి

అ,పల్లవి: నీలమేఘ శరీర నిత్యానందం దేహి ॥బాల॥

1, : కలభసుందరగమన కస్తూరిశోభితానన
నళినదళాయతనయన నందనందన
మిళితగోపవధూజన మీనాకంకోటిమోహన
దళితసంసారబంధన దారుణవైరినాశన ॥బాల॥

2. : వ్యత్యస్తపాదారవింద విశ్వవందితముకుంద
సత్యాఖండ బోధానంద సద్గుణబృంద
ప్రత్యస్తమిత భేదకంద పాలితనందసునంద
నిత్యదనారాయణతీర్థ నిర్మలానంద గోవింద ॥బాల॥

(యశోద కృష్ణుల నిష్క్రమణ. సుబ్బమ్మ, సత్య ప్రవేశం)

సుబ్బమ్మ : పరమేశ్వరా! మా సత్యకి ఏ దృష్టి తగిలిందో మతిమరపుగా మాట్లాడుతున్నాడు. షిర్డీలో సాయిబాబాగా అవతరించిన తానే మళ్ళీ పుట్టేనంటాడు. అందరూ గాలి సోకిందంటున్నారు. బంగారంలాంటి మా సత్యను రక్షించు తండ్రీ.

లాయరు : సుబ్బమ్మగారూ! సత్యానికి గాలి సోకిందన్నారు. నయమయిందా?

సుబ్బమ్మ : అలాగే వుంది లాయరుగారూ. పెనుగొండలో ఎవరైనా పెద్ద డాక్టరుంటే చెప్పండి. సత్యను చూపిద్దాం.

లాయరు : ఇది డాక్టర్లు కుదిర్చే వ్యాధి కాదమ్మా. ఘటికాచలం యాత్ర చేయించండి. పట్టిన పీడ విరగడవుతుంది.

సత్య : లాయరుగిరీ వెలగపెడుతున్నావుగాని నేనెవర్నో తెలుసుకోలేక పోతున్నావు. ఘటికాచలంలో ఉన్నదెవరనుకున్నావు నేనే. నన్ను నా దగ్గరికే తీసుకెళ్ళమంటావా.

లాయరు : ఘటికాచలంలో ఉన్న దైవానివి నువ్వా సత్యం!

సత్య : అవును నేనే. ఘటికాచలంలో ఉన్న దైవాన్ని నేనేనని తెలుసుకో.

పద్యం:

“ఏను దైవంబు తద్భిన్నమేమికాను
ఆయఖండ పరబ్రహ్మ మౌదునేను
వ్యధయు క్లేశము నన్ను స్పృశింపబోవు
సచ్చిదానందుడను భిన్నమేను కాను”

లాయరు : సుబ్బమ్మగారూ! సత్యం అవతారమూర్తిలాగా కనిపిస్తున్నాడు.

సుబ్బమ్మ : మా సత్య బాలకృష్ణుడే. వాడికే గాలీ సోకలేదు. మేమే అనవసరంగా వ్యాకులపడుతున్నాం రా సత్యా!

(సత్య, సుబ్బమ్మ, లాయరు నిష్క్రమిస్తారు. గోపికలు నృత్యం చేస్తూ ప్రవేశిస్తారు)

పల్లవి : జయ జయ గోకుల బాల
జయ సకలాగమ మూల
దయయా మాంగోపాల
దీనం పాలయ బాల ॥జయ॥

1\. దేవమయాచరిత మిదం
దీనధియా అపరాధం
శ్రీవసుధాధవ కృపయా
కేవల మిహి ధునీహి ॥జయ॥

2\. ఈక్షే తావక దేహే
ఈశ జగంతి నిరీహే
వీక్షా శిక్షిత మోహే
వేదాంతాగమ గేహే ॥జయ॥

(నందుడు, గర్గ మహర్షుల ప్రవేశం)

నందుడు : గర్గ మహర్షులకు మా వందనాలు

గర్గుడు : నందరాజా! ఆ లీల దర్శించు. సృష్టికి ఆదిమూలమై హరి హరులకు కూడా అందనివాడైన ఆ శ్రీహరి అమ్మ యశోదతో ఎలా ఆడుకుంటున్నాడో చూశావా? ఏ యోగ సాధనకూ లొంగని పరమాత్మ మీ యింటి ప్రాంగణంలో చిరుగజ్జెల సవ్వడితో నాట్యం చేస్తున్నాడు. నవ విధుల్నీ సృష్టించిన పరబ్రహ్మ గోకులంలో వెన్న దొంగిలిస్తున్నాడు. మహర్షుల భక్తికి కూడా లొంగని పరంధాముడు గోపికల ప్రేమకై వశుడైపోయాడు. యోగులకే లభ్యంకాని యోగ పురుషుడు గోవుల మధ్య గోపాలకుడై ప్రకాశిస్తున్నాడు. దైవలీల ఎంత చిత్రమో చూశావా.

నందుడు : ఈ ఆనందం చిరకాలం ఉండేలా ఆశీర్వదించండి.

గర్గుడు : శ్రీకృష్ణ కృపా కటాక్ష ప్రాప్తిరస్తు. అమ్మా! యశోదా! నీ కుమారుడు పృధ్విలోనే విజయుడై వర్ధిల్లుతాడు. అందరికీ ప్రియుడౌతాడు. జ్ఞాని, తేజోయముడు, దయాసాగరుడై విశ్వానికే వెలుగునివ్వగలడమ్మా. శ్రీ కృష్ణాయ నమోనమ:

యశోద : నమోవాకాలు మహర్షీ (గర్గుడు నిష్క్రమణ)
కృష్ణయ్యా ఆ గోపికలేమంటున్నారో విన్నావా? ఈ గోకులానికి నువ్వే జీవనాధారంట.

కృష్ణుడు : అలా అన్నారా అమ్మా

నీలిమ : మంజరీ అదిగో ఆ శిఖిపింఛ మౌళి పట్టు పీతాంబరంలో ఎలా మెరిసిపోతున్నాడో చూడు

మంజరి : నీలిమా ఆ కళ్ళు కాంతులీనుతూ కలువ రేకుల్లా లేవూ.

యశోద : అలా పొగడకండమ్మా. మా కన్నయ్యకు దృష్టి తగులుతుంది. వెన్నా జున్నూ దొంగిలించాడని, చాడీలు చెప్పడానికొచ్చారా? మా కన్నయ్య నా దగ్గరే ఉన్నాడు.

నీలిమ : నీ దగ్గరే ఉన్నాడా? మరి మా ఇంట్లో వెన్న తింటుంటే చూశానే.

యశోద : చూస్తే పట్టుకొని బంధించలేకపోయావా

మంజరి : యశోదమ్మా కన్నయ్య వెన్న తింటుంటే వెన్నెల కిరణాలతో చంద్రభిషేకం చేస్తున్నట్టనిపించి, ఆ మనోహర దృశ్యం చూసి మైమరచిపోయి పట్టుకోవాలనే మరచిపోయాను.

నీలిమ : మా యింట్లో దూడల్ని విడిచిపెట్టేశాడు. అవి ఆవుల పాలన్నీ తాగేశాయమ్మా.

కృష్ణుడు : అమ్మా నాకాకలేస్తే పాలివ్వవా

యశోద : ఇస్తానయ్యా.

కృష్ణుడు : పాపం ఆ దూడలు అంబా అని ఆకలితో అరిచాయమ్మా జాలేసి వదిలేశానమ్మా.

యశోద : నా రతనాలరాశివి ఎంత జాలిగెండెరా నీది.

నీలిమ : మా యింట్లో ఉట్టి మీద దుత్తలోని పాలన్నీ అందరికీ పంచాడమ్మా

కృష్ణుడు : ఉట్టిమీద పాలదుత్తలు ఈ చిన్న చేతులకందుతాయా అమ్మా

యశోద : అందవు నాన్నా. మా కృష్ణుడు ఇక్కడే ఉన్నాడు. ఇవన్నీ ఎలా చేశాడమ్మా.

వసంతకుడు : కృష్ణయ్య అక్కడా ఇక్కడా కూడా ఉన్నాడమ్మా

యశోద : ఆ!

కృష్ణుడు : అమ్మా, ఎక్కడికీ వెళ్ళకుండా నీ దగ్గరే ఉండిపోనా.

యశోద : ఉండిపో నాన్నా. ఎవ్వరూ నీ మీద చాడీలు చెప్పలేరు.

గోపిక : యశోదమ్మా అలాగనకమ్మా. కన్నయ్య కాలిమువ్వల సందడీ, తీయని వేణునాదం వినకుండా మేముండగలమా. వెన్నెల కురిసే చిరునవ్వు చూడకుండా ఉండగలమా? మీ అల్లరి కన్నయ్య ఆటలే ఈ గోకులానికందం. ప్రతిక్షణం ఈ విశ్వమోహన రూపాన్ని చూడటమే మాకానందం.

పల్లవి : గోవింద మిహ గోపికానంద కందం
సానంద మవలోకయామో ముకుందం

1. గోపికాదళనయన కుముద పూర్ణేందుం
గోపాల కులతిలక మఖిల జన బంధుం
శ్రీపతి మనింద్యహరి చందన సుగంధిం
శ్రేయోవిభావీ కరుణారససింధుం ॥గోవింద॥

2. ఉరదధర కవిత మురళీనాద సుధయా
సురసుందరీగణం హర్షయతి కృపయా
గురుకరుణయా కథిత మేవదసిలలితం
నారాయణ నంద తీర్థ సముదితం ॥గోవింద॥

వసంతకుడు : అమ్మా యశోదమ్మా! గోపాలకులొచ్చేస్తున్నారు. బృందావనానికి గోవులను తోలుకెళ్ళాలి. కృష్ణయ్యను పంపమ్మా.

(గోపికలు నిష్క్రమిస్తారు, యశోద ఉంటుంది. గోపాలురు నృత్యం చేస్తూ ప్రవేశిస్తారు)

పల్లవి : గోపాలకృష్ణయ్య రావయ్యా
ఆటలాడుకుందాము రావయ్య
వెన్న జున్ను తిందాము రావయ్య
పాలు పెరుగు తాగుదాము రావయ్య ॥గోపాల॥

చ. గోవులను తోలుకొని యమునకు పోయామని
గోధూళివేళ కాని తిరిగి పల్లె చేరమని
పల్లెలో గోపికలు ఆదమరచి ఉన్నవేళ
వెన్న జున్ను దొంగిలించి తిందాము రావయ్య ॥గోపాల॥

చ. సద్దులేక కన్నుగప్పి యింటింటా దూరి మనము
ఉట్టిమీద దుత్తలన్ని అందంగా పగులగొట్టి
నోటిమీద మరకలేక వెన్న ఎలా మెక్కాలో
నటన సూత్రధారివి నీవే ఇక చెప్పవయ్య ॥గోపాల॥

(బలరాముడు ఆత్రపడుతూ ప్రవేశం)

బలరాముడు : అమ్మా! తమ్ముడు యమునలో దూకాడమ్మా

యశోద : స్వామీ! మన కన్నయ్య యమునలో దూకాడట. విన్నారా. నా బిడ్డని రక్షించండి. కన్నయ్యా కన్నయ్యా

నంద : గోపాలదేవా వెంటనే రక్షకుల్ని ఏర్పాటు చెయ్యండి యమునకు పదండి.

(కృష్ణుడు కాళీయునితో నృత్యం చేస్తూ ఉంటాడు. ఆశ్చర్యపోయి గోకులమంతా చూస్తూ ఉంటారు. పున్నాగ రవళినృత్యం. చివరికి కాళీయుడి పడగలపైకి చేరుకుంటాడు కృష్ణుడు.)

వసంతకుడు : అదుగో కృష్ణయ్య! కాళీయుని పడగలపై నాట్యం చేస్తున్నాడు యశోదమ్మా! చూడమ్మా

నంద : చూడు యశోదా! మన కృష్ణయ్య విషనాగుని వశం చేసుకొని ఎలా నృత్యం చేస్తున్నాడో.

గోపాలదేవుడు : నందరాజా! మన కృష్ణయ్య నిజంగా దేవాదిదేవుడే.

యశోద : ఆ కన్నయ్య నా కుమారుడయ్యా

(యశోద, గోపికల నృత్యం)

(ఆనందంగా యశోద, గోపికలు నృత్యం చేస్తారు)

పల్లవి: శరణం భవ కరుణామయి కురుదీనదయాళో
కరుణారస వరుణాలయ కరిరాజ కృపాళో

అ.పల్లవి: అధునా ఖలు విధానామయి సుధియా సురభరితం
మధుసూదన మధుసూదన హరమామక దురితమ్ ॥శరణం॥

చ.1. వరనూపుర ధర సుందర కరశోభిత వలయ
సురభూసుర భయవారక ధరణీధర కృపయా
త్వరయా హర భరమీశ్వర సురవర్య మదీయం
మధుసూదన మధుసూదన హరమామక దురితమ్ ॥శరణం॥

చ.2. ఘృణిమండల మణికుండల ఫణిమండల శయన
అణిమాది సుగుణ భూషణ మణిమంటపసదన
వినతాసుత ఘనవాహన ముని మానసభవన
మధుసూదన మధుసూదన హరమామక దురితమ్ ॥శరణం॥

(కృష్ణుడు, గోకులవాసులు నిష్క్రమిస్తారు. సుబ్బమ్మ, సత్య ప్రవేశం)

క॥సుబ్బమ్మ : సత్యా కాలకూటం కక్కే ఆ విషనాగునాని ఎలా వశపరచుకున్నావయ్యా

సత్య : పన్నగ శయనుణ్ణి, భుజంగ భూషణుణ్ణి నాకెందుకమ్మా భయం.

క॥సుబ్బమ్మ : మరి ఈ అవతారంలోనూ విషంతో అటలాడుకుంటావా!

సత్య : ఆడుకుంటానమ్మా. అసూయతో విషపూర్తిమైన వడలు నాకు ఫలహారంగా ఇస్తారమ్మా. ఆ విషం నన్నేమీ చేయలేదని నిరూపిస్తాను. అంతేకాదు. ఆ విష్ప్రయోగం చేసినామెను ప్రేమతో ఆదరించి, ఆశ్రయం కల్పిస్తానమ్మా.

సుబ్బమ్మ : ఆ అలాగా! నిర్మల ప్రేమమూర్తివి. ద్వేషించిన వారిని కూడా ప్రేమించడం నీకే సాధ్యమయ్యా.

(సుబ్బమ్మ, సత్య నిష్క్రమిస్తారు. యశోద పాడుతూ వెన్న చిలుకుతూ ఉంటుంది. కృష్ణుడు నృత్యం చేస్తూ ఉంటాడు)

(నందుడు, గోపాలదేవుడూ ప్రవేశం)

గో॥దేవుడు : నందరాజా! ఇంద్రపూజకు ఏర్పాట్లన్నీ పూర్తి చేశాము. ప్రభువులు అనుమతిస్తే సుముహూర్తంలో ప్రారంభిస్తాము.

కృష్ణుడు : ఈ ఇంద్ర పూజలనవసరం నాన్నగారూ.

నందుడు : అలా అనకూడదు నాయనా ఇంద్రుడికి ఆగ్రహం వస్తుంది.

యశోద : నాన్నగారన్నది నిజం కృష్ణా

కృష్ణుడు : అమ్మా! కాళీయుని మర్దించినవాణ్ణి, పూతనను హతమార్చినవాణ్ణి, శకటాసుర, బకాసుర, అఘాసురులను హతమార్చిన వాణ్ణి నేనుండగా ఇంద్రుడికి భయపడతారేమిటమ్మా.

నందుడు : గోపాలదేవా! ఇంద్రపూజలు ఆపండి. మా కన్నయ్య మాటే మాకు వేదవాక్కు.

గో॥దేవుడు : అలాగే ప్రభూ

(కుంభవృష్టి శబ్దం వినిపిస్తుంది)

గో॥దేవుడు : నందరాజా గోకులమంతా కుంభవృష్టితో అతలాకుతలమౌతోంది.

నందుడు : కృష్ణయ్యా నీవే మాకు దిక్కు. మా రక్షణ భారం నీదే.

కృష్ణుడు : గోపాలదేవా గోవర్ధనగిరి వద్దకు పదండి

(యశోదనందులు కృష్ణుని వెనుకనే వెళతారు. కృష్ణుడు గోవర్ధన గిరినెత్తుతాడు)

వసంతకుడు : రండి రండి అందరూ ఈ కొండ క్రిందికి రండి. (వర్షం తగ్గుముఖం పడుతుంది)

ఇంద్రుడు : కృష్ణా! పాహిమాం పాహిమాం నీవు సాక్షాత్తు శ్రీమన్నారాయుణివివని తెలుసుకోలేక గర్వపడ్డాను. నా గర్వం సర్వాన్నీ హరించావు. శ్రీ కృష్ణాయ నమోనమః

(ఇంద్రుడు కృష్ణుడికి నమస్కరించి నిష్క్రమిస్తాడు, గోపికలు ఆనందంగా నృత్యం చేస్తూంటారు)

పల్లవి: గోవర్ధన గిరిధర గోవింద
గోకుల పాలక పరమానంద ॥గోవర్ధన॥

అ.పల్లవి: శ్రీవత్సాంకిత శ్రీకౌస్తుభధర
భావక భయహర పాహిముకుంద ॥గోవర్ధన॥

చ. పాటిత సురరిపు పాదపబృంద
పావన చరిత పరామృత కంద
నాట్య రసోత్కట నానాభరణ
నారాయణతీర్థార్చిత చరణ ॥గోవర్ధన॥

(కృష్ణుడు, యశోద, గోకులవాసుల నిష్క్రమణ, సత్య, సుబ్బమ్మ ప్రవేశం)

క॥సుబ్బమ్మ : సత్యా! బాలకృష్ణుడిగా గోవర్ధనగిరి నెత్తావుకదా మరి ఈ అవతారంలో కూడా గోవర్ధనగిరి నెత్తుతావా

సత్య : గోవర్ధన గిరి నెత్తడమంటే అసాధ్యాన్ని సుసాధ్యం చేయడమేకదమ్మా. ఈ అవతారంలో

ఒకటి కాదు ఎన్నో గోవర్ధన గిరులెత్తుతానమ్మా.

కII సుబ్బమ్మ : నిజమా సత్యా!

సత్య : నేనెప్పుడూ అసత్యమాడనమ్మా. భవిష్యత్తులో జరిగేది చూపిస్తాను చూడు. అదిగో పుట్టపర్తిలో వేలాదిమందికి ప్రాణదానం చేసే అసుపత్రి. ఇదిగో బెంగుళూరులో అసంఖ్యాకమైన రోగార్తులకు జీవనదానం చేసే మరో అసుపత్రి. అటు చూడు మద్రాసు మహానగరంలో లక్షలాదిమంది దాహార్తిని తీర్చే సుజల పథకం ఇదిగో అనంతపూర్, మెదక్, మహబూబ్‌నగర్, గోదావరి జిల్లాలో లక్షలాది దాహార్తుల ఆర్తిని తీర్చే మంచినీటి పథకం. ఇక్కడ చూడు లక్షలాదిమంది విద్యార్థుల్ని వివేకానందులుగా మార్చే విశ్వవిద్యాలయం ఇవన్నీ గోవర్ధన గిరులు కావా అమ్మా.

కII సుబ్బమ్మ : గోవర్ధనగిరినెత్తి వ్రేపల్లె వాసులను మాత్రమే ఆనాడు రక్షించావు. మరి ఈ అవతారంలో నీవెత్తే గోవర్ధనగిరులు కోట్లాది మంది జీవితాలలో విశ్వవ్యాప్తంగా ఆశాజ్యోతులు వెలిగిస్తాయి.

సత్య : ఇవన్నీ నేనెందుకు చేస్తానో తెలుసా అమ్మా

పద్యం:

శ్రీ పుట్టపర్తి నిలయుడు<br>
కాపాడును నిన్నునెపుడు కరుణాకరుడై<br>
చేపట్టి నిన్ను బ్రోచును<br>
ఏ పట్టున విడవకుండ ఏలును నిన్నున్

అని వాగ్దానం చేశాను కనుక.

కII సుబ్బమ్మ : నేనివన్నీ చూస్తానో లేదో. సాయికృపా! ఈ అమ్మ కోరిక ఒక్కటి తీర్చవా

సత్య : అడిగింది లేదని ఎప్పుడైనా అన్నానా. అడుగమ్మా తప్పక తీరుస్తాను.

కII సుబ్బమ్మ : సత్యా యశోదగా నిన్నెలా ఊయలలో ఊపేనో నాకు గుర్తు లేదు. నిన్ను ఊయలలో ఊపాలనుంది సత్యా. నా కోరిక మన్నిస్తావా

సత్య : కన్న కొడుకుకంటే మిన్నగా ప్రేమించావు. కాదంటానా అమ్మా.

పల్లవి: గోపాలకృష్ణాలాలీ గోవిందకృష్ణాలాలీ<br>
బృందావన శ్యామ లాలీ త్రయీ బృందావన సాయి లాలీ ॥గోపాల॥

1. యశోదనందనలాలీ యదుకులతిలకా లాలీ<br>
నందకిశోరా లాలీ ఆనందముకుందా లాలీ<br>
ప్రశాంతినిలయా లాలీ పర్తివిహారా లాలీ<br>
బృందావన శ్యామ లాలీ త్రయీ బృందావన సాయి లాలీ ॥గోపాల॥

2. వెన్నదొంగ సాయి లాలీ వేణుగోపాలా లాలీ<br>
గోవర్ధనోద్ధార లాలీ గోపిమనోహర లాలీ<br>
ప్రేమావతారా లాలీ పర్తిగోపాలా లాలీ<br>
బృందావన శ్యామలాలీ త్రయీ బృందావన సాయి లాలీ ॥గోపాల॥

జై సాయిరాం